## అనుకతిర్ సూర్య

తన పేరు, జెండర్ మార్చాలంటూ ఓ ఐఆర్ఎస్ ఆఫీసర్ చేసుకున్న అప్పీల్‌పై కేంద్రం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇండియన్ సివిల్ సర్వీసెస్ చరిత్రలో మొట్టమొదటిసారి ఓ ఐఆర్ఎస్ అధికారిణి పేరు, జెండర్‌ను అధికారికంగా మార్చడానికి ఆమోదం తెలిపింది. తన పేరును ఎం అనుకతిర్ సూర్యగా, తనను పురుషుడిగా గుర్తించాలని ఐఆర్ఎస్ ఆఫీసర్ ఎం అనసూయ చేసుకున్న అభ్యర్థనను కేంద్ర ఆర్థిక శాఖ ఆమోదించింది. ఈ మేరకు కేంద్రం జూలై 9న ఉత్తర్వులు విడుదల చేసింది. కేంద్రం నిర్ణయం 'ప్రగతిశీలమైంది'గా ఆ ఐఆర్ఎస్ ఆఫీసర్ పేర్కొన్నారు. దేశంలో లింగ వైవిధ్యం పట్ల సానుకూలతను తీసుకొస్తుందన్నారు. ఆయన హైదరాబాద్ సీఈఎస్‌టీఏటీ జాయింట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

# ఆరు దశాబ్దాల ఒప్పందం - పాకిస్థాన్‌కు అల్టిమేటం

గ్రూప్-1 ప్రత్యేకం
కరెంట్ టాపిక్

## సింధూ నదీ జలాల పంపిణీ ఒప్పంద సమీక్ష



- సింధూ జలాల పంపిణీ ఒప్పందాన్ని సమీక్షించాలని పట్టుపడుతున్న భారత్ పాకిస్థాన్‌కు నోటీస్ ఇచ్చింది. ఒప్పందంపై మళ్లీ జరపడానికి సిద్ధమేనని పాకిస్థాన్ అంటున్నా వాస్తవంగా ఇది సాధ్యమేనా? అనే చర్చ మొదలైంది.
- ఆరు దశాబ్దాల క్రితం సింధూ జలాల ఒప్పందం కుదిరిన తర్వాత నుంచి పర్యావరణ పరంగా, భౌగోళికంగా, రాజకీయంగా చాలా మార్పులు వచ్చాయి. వీటిని పరిగణనలోకి తీసుకుని ఒప్పందాన్ని సమీక్షించాలని భారత్ కోరుతుంది. ఇందుకు పాకిస్థాన్ కూడా సింధూ ఒప్పంద అమలుకు కట్టుబడి ఉందని తెలియజేసింది.

### 1960 నాటి ఒప్పందం

- సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960, సెప్టెంబర్‌లో నాటి భారత ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్ ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు, ఉపనదుల్లో రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. సింధూ నదితో పాటు జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులు లభించాయి.
- ఈ నదీ జలాల వినియోగ సమాచారాన్ని పంచుకోవడానికి ఒప్పందం కింద ఒక సహకార యంత్రాంగాన్ని నెలకొల్పారు. సింధు, ఉపనదుల జలాలను భారత్, పాకిస్థాన్ పరస్పర స్నేహ, సహకారాన్ని, సుహృద్భావాలతో పంచుకోవాలని ఒప్పంద పీఠిక నిర్దేశిస్తుంది.
- సింధు, జీలం, చీనాబ్ నదులపై భారత్‌కు కొన్ని హక్కులు జల విద్యుదుత్పాదన, జల రవాణా, చేపల వేటకు ఉపయోగించుకోవచ్చు. ఒప్పందం కింద శాశ్వత సింధు కమిషన్‌ను నెలకొల్పారు. అందులో రెండు దేశాల నుంచి చెరొక కమిషన్ సభ్యులుగా ఉంటారు. ఒప్పందం అమలు గురించి సమావేశాలు జరుగుతాయి. ఒక ఏడాది భారత్‌లో, మలి ఏడాది పాకిస్థాన్‌లో వాటిని నిర్వహించాలని ఒప్పందం నిర్దేశించింది.

### తాజా వివాదాలు

- గడిచిన ఆరు దశాబ్దాల్లో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాలు జరిగాయి. పలుమార్లు ఉద్రిక్తతలు నెలకొన్న సింధు జలాల ఒప్పందం అమలుకు అవేవీ అడ్డుకోలేదు. కానీ ఇటీవల డ్యామ్ నిర్మాణం, నీటి వినియోగం, ఒప్పంద నిబంధనల అమలుకు సంబంధించి వివాదాలు తలెత్తాయి. ముఖ్యంగా జీలం, చీనాబ్‌లపై జమ్మూకశ్మీర్‌లో నిర్మితమవుతున్న జల విద్యుత్ కేంద్రాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. ఒప్పందం ప్రకారం ఈ ఉపనదుల జలాలను భారత్ సాగు కోసం పరిమితంగా, జలవిద్యుత్ కోసం గరిష్ఠంగా ఉపయోగించుకోవచ్చు. కిషన్‌గంగ, రాట్లే ప్రాజెక్టులపై పాకిస్థాన్ వివాదం లేవనెత్తి మధ్యవర్తిత్వ కోర్టును ఏర్పాటు చేయాల్సిందిగా ప్రపంచ బ్యాంకును కోరింది. ఏ వివాదాన్నీ పరిష్కరించుకోవాలన్నా తటస్థ నిపుణుడిని నియమించాలని ఒప్పందం నిర్దేశిస్తుంది. ఈ విషయాన్నే భారత్ గుర్తు చేస్తుంది. అయినా ప్రపంచ బ్యాంక్ అటు భారత్ కోరిన ప్రకారం మైకేల్ లీనోను తటస్థ నిపుణుడిగా పాకిస్థాన్ కోరిన ప్రకారం షాన్ మర్ఫీ అధ్యక్షతన మధ్యవర్తిత్వ కోర్టునూ నియమించింది. ఇలా ఒకే సమస్యపై రెండు రకాలుగా చర్యలు తీసుకోవడం చట్టపరంగా ఆచరణపరంగా సమస్యలకు దారి తీస్తుంది. భారత్ వాదన అందరూ సింధూ జలాల ఒప్పందం ప్రకారమే నడుచుకోవాలని భారత్ స్పష్టం చేసింది.

### మార్పుల నేపథ్యంలో..

- భారత ప్రభుత్వం 2023, జనవరిలో పాకిస్థాన్‌కు రాసిన లేఖలో సింధూ జలాల పంపిణీ ఒప్పందం నియమ నిబంధనలపై పునర్‌సమీక్ష చేయాలని పేర్కొంటుంది. 1969లో ఒప్పందం కుదిరిన నాటికి రెండు దేశాల జనాభాలో తాగు, సాగు నీటి అవసరాల్లో చాలా మార్పులు వచ్చాయని, పర్యావరణ, భౌగోళిక, రాజకీయంగా కూడా మార్పులు చోటు చేసుకున్నాయని గుర్తు చేసింది. ఈ అంశాలను వివరించే సామర్థ్యం షాన్ మర్ఫీ నేతృత్వంలోని కోర్టుకు ఉందని గతేడాది జూలైలో అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టు తీర్మానించింది. తద్వారా పాక్ వైఖరిని విమర్శించింది. దీంతో ఈ మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చే ఏ తీర్పునూ తాను గౌరవించనని భారత్ స్పష్టం చేసింది. ఈ కోర్టు నియామకం సింధూ నదీ జలాల ఒప్పందానికి విరుద్ధమని భారత్ తేల్చి చెప్పింది.
- ఈ నేపథ్యంలో సింధూ నదీ జలాల ఒప్పంద సమీక్షను చేపడదామని భారత్ 2023, జనవరిలో పాకిస్థాన్‌కు సూచించింది. ఆ తర్వాత పలుమార్లు ఈ అంశాన్ని గుర్తు చేసింది. చివరిగా ఈ ఏడాది ఆగస్టు 30న పాకిస్థాన్‌కు అల్టిమేటం జారీ చేసింది. దీంతో పాకిస్థాన్ సంప్రదింపులకు దిగి వస్తుందా లేదా అని వేచి చూడాలి.

### సింధూ నది వ్యవస్థ

- సింధూ నది టిబెట్‌లోని కైలాస్ పర్వతాల తూర్పు భాగాన గల మానస సరోవర్‌లోని 'బోఖర్‌చు' హిమనదం వద్ద జన్మించింది.

### ఇతర పేర్లు

- సంస్కృతంలో సింధు
- లాటిన్‌లో సిందూస్
- పర్షియన్- హైందరి
- టిబెట్‌లో సింగ్ జాంగ్ బో/ సింఘే

### ప్రవాహ రీతి

- సింధూ నది పొడవు 2880 కి.మీ. ఇది టిబెట్, భారత్, పాకిస్థాన్‌ల గుండా ప్రయాణించి కరాచీ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది. భారత్‌లో లడఖ్‌లోని లేహ్ జిల్లా గుండా మాత్రమే 1114 కి.మీ పొడవున ప్రవహిస్తుంది. ఇది భారత్‌లో దెమ్‌చోక్ వద్ద ప్రవేశిస్తుంది. భారత్‌లో దీని పరీవాహక ప్రాంతం 3,21,000 చ.కి.మీ ఉంది.
- సింధూ నది నంగా పర్బత్ పర్వతాన్ని తాకుతూ ప్రవహిస్తూ ఉత్తరాన బుంజి వద్ద అత్యంత లోతైన 5181 మీ. సింధు గార్జ్‌ను ఏర్పరస్తుంది. ఈ సింధు గార్జ్ పూర్వవర్తి లోయకు ఉదాహరణ. సింధూ నది పరీవాహక ప్రాంతం కలిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు.
- జమ్మూకశ్మీర్, లడఖ్- 60.70 శాతం
- పంజాబ్- 15.73 శాతం
- హిమాచల్‌ప్రదేశ్- 15.68 శాతం
- రాజస్థాన్- 4.11 శాతం
- హర్యానా- 3.64 శాతం
- చండీగఢ్- 0.04 శాతం
- ఉత్తరాఖండ్- 0.01 శాతం

### ప్రత్యేకతలు

- లడఖ్, హరమోష్ శ్రేణులు సింధూ నదికి ఉత్తరం వైపు ఉండగా, జస్కార్, దియోసామ్ శ్రేణులు దక్షిణం వైపు ఉన్నాయి. అంటే ఈ నది లడఖ్, జస్కార్ శ్రేణుల మధ్య నుంచి ప్రవహిస్తుంది.
- పుట్టిన ప్రదేశం వాయవ్య దిశగా ప్రవహించే నది నంగా పర్బత్ శిఖరం వద్ద దిశను మార్చుకొని దక్షిణం వైపు ప్రవహిస్తుంది. మైథాన్‌కోట్‌కు కొద్దిగా పైన పంచ్‌నాడ్‌ను కలుపుకొంటుంది. పంజాబ్‌లో పంచ్‌నాడ్ అంటే ఐదు నదులు- జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదుల సంయుక్త ప్రవాహాన్ని పంచ్‌నాడ్ నది అంటారు. 71 కి.మీ. సంయుక్త ప్రవాహం. హరప్పా, తొలి వేదకాలపు నాగరికతలు వృద్ధి చెందాయి.
- దేశంలో 39 శాతం పరీవాహక ప్రాంతాన్ని కలిగి ఉంది. పాకిస్థాన్, టిబెట్‌లో మిగిలిన పరీవాహకం కలిగి ఉంది. పాకిస్థాన్‌లో ఎక్కువ పరీవాహకం కలిగి ఉండటం వల్ల పాకిస్థాన్ జాతీయ (నేషనల్ రివర్ ఆఫ్ పాకిస్థాన్) నదిగా పిలుస్తున్నారు.
- ఈ మొత్తం నదీ పరీవాహక ప్రాంతం 896 మి.మీ సగటు వర్షపాతం కలిగి ఉంది. సింధూ నదిని లడఖ్‌లో కలిసే ఉపనదులు ష్యోక్, శిగర్, హంజ, జస్కార్.

## ఉపనదులు

1) ఎడమవైపున సింధూను కలిసే ఉపనదులు జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ జస్కార్, ద్రాస్ నదులు వరుసగా.
- సింధూ పశ్చిమ నదులు- జీలం, చీనాబ్
- సింధూ తూర్పు నదులు- రావి, బియాస్, సట్లెజ్

2) కుడివైపున సింధూను కలిసే ఉపనదులు శిగర్, గిల్గిట్, హంజా, స్వాత్, కునార్, కాబుల్, తోచి, ఖుర్రం, గోమత్, విబోవ, సంగర్.

**జీలం:** దీని ఇతర పేర్లు వితస్థ, హైడాస్పెస్, బిహట్, కశ్మీర్‌కు జీవనాడి (లైఫ్ లైన్ ఆఫ్ కశ్మీర్). జీలం జమ్మూ కశ్మీర్‌లోని పీర్‌పంజాల్ పర్వత శ్రేణిలోని 'వెరినాగ్' వద్ద జన్మించింది. దీని మొత్తం పొడవు 724 కి.మీ పొడవునా భారత్, పాకిస్థాన్ మధ్య ప్రవహిస్తుంది. ఇది పాకిస్థాన్‌లోని ఝాంగ్ జిల్లాలో గల అఠారా హజారి పట్టణం దగ్గర గల ట్రిమ్ము బ్యారేజ్ వద్ద చీనాబ్ నదిని కలుస్తుంది.
- శ్రీనగర్ లోయ గుండా ప్రవహిస్తుంది. ఉలార్ సరస్సు దేశంలో అతిపెద్ద మంచినీటి సరస్సు ఈ నదిపై ఉంది. పీర్‌పంజాల్, ఉన్నత హిమాలయాల మధ్య పరీవాహక ప్రాంతాన్ని కలిగి ఉంది. దీని ఉప నదులు- పూంచ్, లిడ్డార్, కిషన్‌గంగ (నీలం), కున్వర్.

**చీనాబ్:** అసిక్ని, చంద్రభాగ అనే పేర్లు ఉన్నాయి. ఇది హిమాచల్‌ప్రదేశ్‌లోని బారాలాప్చా కనుమ వద్ద జన్మించింది. చంద్ర, భాగ అనే రెండు నదుల కలయిక వల్ల చీనాబ్ ఏర్పడింది. చీనాబ్ మొత్తం పొడవు 1180 కి.మీ దూరం భారత్, పాకిస్థాన్‌లో ప్రవహిస్తుంది.
- సింధూ నదికి అతిపెద్ద ఉపనది చీనాబ్. పీర్‌పంజల్ శ్రేణికి సమాంతరంగా పంగిలోయ గుండా ప్రవహిస్తుంది. చంద్ర, భాగ నదులు హిమాచల్‌ప్రదేశ్‌లోని తాండి వద్ద కలుసుకుంటాయి. చీనాబ్ ఆక్నూర్ వద్ద మైదాన ప్రాంతంలోకి ప్రవేశించి పంజ్‌నాడ్ వద్ద సట్లెజ్ నదిలోకి ప్రవేశిస్తుంది.

**రావి:** పరూష్ణి, లాహోర్, ఐరావతి వంటి మారుపేర్లు రావి నదికి ఉన్నాయి. రావి హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు కొండల్లోని రోహతంగ్ కనుమ వద్ద జన్మించింది. ఇది పీర్‌పంజల్, ధౌల్‌ధర్ పర్వతాల మధ్య ప్రవహిస్తూ గార్జ్‌ను ఏర్పరస్తుంది.
- చంబా లోయ గుండా ప్రవహిస్తూ బిస్సోలి వద్ద మైదాన ప్రాంతంలోకి ప్రవేశిస్తుంది. రావి నదికి ఉపనది అయిన సియోల్ పరీవాహక ప్రాంతాన్ని గార్డెన్ ఆఫ్ చంబా అని పిలుస్తారు.
- తొలి వేద కాలానికి చెందిన దశ రాజ యుద్ధం (బ్యాటిల్ ఆఫ్ టెన్ కింగ్స్) ఈ నది ఒడ్డునే జరిగింది. పాకిస్థాన్‌లోకి ప్రవేశించాక సరాయ్ సిద్ధు వద్ద చీనాబ్ నదితో కలుస్తుంది. ఈ నది ఒడ్డున లాహోర్ పట్టణం ఉంది. కాబట్టి దీనికి రివర్ ఆఫ్ లాహోర్ అని పేరు. రావి నది 720 కి.మీ పొడవున భారత్, పాకిస్థాన్ మధ్య ప్రవహిస్తుంది.

**బియాస్:** విపశ, అర్‌గ్రికయా వంటి పేర్లు ఉన్నాయి. బియాస్ హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు లోయలోని రోహతంగ్ కనుమ వద్ద గల బియాస్‌కుండ్ వద్ద జన్మిస్తుంది.
- కులు, కాంగ్రా లోయల గుండా ప్రవహిస్తూ ధౌలాధర్ శ్రేణిలో కటి, లార్జి వద్ద గార్జ్‌లను ఏర్పాటు చేస్తుంది. శివాలిక్‌ను దాటి పోంగ్ వద్ద మైదానంలోకి ప్రవేశిస్తుంది. ఇది హరికే చిత్తడి నేలల (పంజాబ్) వద్ద సట్లెజ్‌లోకి ప్రవేశిస్తుంది.

**సట్లెజ్:** శతద్రి, లాంగ్‌చెన్, ఖంభాజ్ అనే పేర్లు ఉన్నాయి. సట్లెజ్ నది 4630 మీ. ఎత్తులో సింధూ నది జన్మస్థానానికి సమీపాన, మానస సరోవర్‌కు దగ్గరలోని రాకాసి సరస్సు వద్ద జన్మించింది.
- సట్లెజ్ షిప్కిలా కనుమ గుండా హిమాచల్‌ప్రదేశ్ వద్ద భారత భూభాగంలోకి ప్రవేశించి పాకిస్థాన్‌లోని మిథన్ కోట్ వద్ద సింధూ నదిలో కలుస్తుంది. సింధు ఉపనదుల్లో పొడవైనది. దీని పొడవు 1450 కి.మీ. టిబెట్, భారత్, పాకిస్థాన్ గుండా ప్రవహిస్తుంది. భారత్‌లో సట్లెజ్ పొడవు 1050 కి.మీ హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ గుండా ప్రవహిస్తుంది.
- భారత్‌లోకి ప్రవేశించే ముందు సింధూ నదికి 400 కి.మీ దూరం సమాంతరంగా ప్రయాణిస్తుంది. ఫిరోజ్‌పూర్ నుంచి ఫజిల్కా వరకు 120 కి.మీ సరిహద్దును భారత్, పాకిస్థాన్ మధ్య ఏర్పరిచింది. రోపార్ వద్ద గార్జ్‌ను ఏర్పరిచింది. దీన్ని పూర్వవర్తి ప్రవాహనదిగా పిలుస్తారు.

**ష్యోక్:** దీన్ని మృత్యు నది (రివర్ ఆఫ్ డెత్) అని పిలుస్తారు. ఇది లడఖ్‌లోని కుమ్‌డంగ్ హిమనదం వద్ద జన్మిస్తుంది. కారకోరం, లడఖ్ శ్రేణుల మధ్య ప్రవహిస్తూ కేరిస్ వద్ద సింధూను కలుస్తుంది.
- ఇది లడఖ్‌లో మాత్రమే ప్రవహిస్తుంది. సియాచిన్ హిమనదం వద్ద పుట్టే నుబ్రా దీని ఉప నది.

జీ గిరిధర్
సివిల్స్ ఫ్యాకల్టీ
బీసీ స్టడీ సర్కిల్, హైదరాబాద్
9966330068

